క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య, నేతలు

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లి పంచాయతీ గాడిదలమెట్ట గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య గురువారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం శివారు గ్రామాల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. ఏఈ బాలకిశోర్, చౌడుపల్లి సర్పంచ్ లలిత, నాయకులు సింహాచలం, ఆయూబు, గంగన్నపడాల్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి చెరువులకు వేలం

దేవీపట్నం: ఇందుకూరుపేటలోని మూడు సాగునీటి చెరువులకు పంచాయతీ అధికారులు గురువారం వేలం నిర్వహించారు. గ్రామంలో గల పోతురెడ్డి, మంగరౌతు, దాసరి వారి చెరువులకు మూడు సంవత్సరాల పాటు చేపల పెంపకం కోసం వేలం నిర్వహించగా హెచ్చుపాటదారురాలైన అదే గ్రామానికి చెందిన పీరుగాని రామయమ్మ రూ.49,7000 వేలం దక్కించుకున్నారు. సర్పంచ్ కారం కృష్ణబాబు, పంచాయితీ కార్యదర్శి శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏపీవోగా అప్పలరాజు



వై.రామవరం: వై.రామవరం ఉపాధి హామీ కార్యాలయ ఏపీఓగా టి.అప్పలరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జిల్లా డ్వామా పీడీ కార్యాలయం నుంచి బదిలీపై వై.రామవరం వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీవో ప్రకాశ్‌బాబు గంగవరం మండలానికి బదిలీపై వెళ్లారు.

వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

డుంబ్రిగుడ: మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పెడుతున్న భోజనానికి సంబంధించిన మెను అమలుచేయని వార్డన్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.సూర్యనారాయణ గురువారం తెలిపారు. విద్యార్థులకు సక్రమంగా మోనూ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న నిర్వాహకులపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మాతృభాష పరిరక్షణ అత్యవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్‌నాయక్ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ అత్యవసరమన్నారు. విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యాబుద్ధులు అలవర్చుకోవాలన్నారు. ఉన్నత చదువులతో సమాజంలో ఆదర్శవంతంగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు పుష్పరాజ్, చలపతిరావు, నాగబాబు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీ సాయిబాబా వారి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. మోహన్‌కుమార్, సూర్యనారాయణ, పాండురంగ అన్న సమారాధనకు అవసరమైన విరాళాన్ని సమకూర్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

'నవరత్నాలు'తో పేదలకు భరోసా



లువ్వాసింగిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



గ్రామస్తులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

జి.మాడుగుల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలతో పేద ప్రజలకు ఆర్థిక భరోసా లభించిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చెప్పారు. మండలంలోని పెదలువ్వాసింగి గ్రామ సచివాలయ పరిధిలో ఎర్రగొప్పు, లువ్వాసింగి గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో 108 గడపలను ఆమె సందర్శించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు ద్వారా ప్రజలకు వర్తించిన లబ్ధిని వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ఆమె ఆరా తీశారు. ఈ నాలుగున్నరేళ్ల కాలంలో ఏఏ పథకంలో ఎంతంత ఆర్థిక సహాయం అందిందన్న వివరాలను గణాంకాలతో ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అందిస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు బాగా పనిచేస్తున్నాయని ఆమె కితాబు ఇచ్చారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జగన్ పాలనపై ప్రతీ ఒక్కరు ఆనందం వ్యక్తం చేస్తుండడం తనకు ఎంతో సంతోషాన్నిస్తోందన్నారు. 2024 సంవత్సరంలో కూడా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికు పట్టం కట్టటానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉండడాన్ని చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు ప్రజలకు మాయమాటలు చెబుతున్నారన్నారు. ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, మత్స్యరాస విజయకుమారి, కూడా చిన్నారావు, చిట్టిబాబు, సర్పంచ్‌లు కొండపల్లి సుబ్బలక్ష్మి, సురభంగి రామకృష్ణ, కిముడు రాంబాబు, మాతే వెంకటరమణ, గంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ ఎల్.కల్యాణం, వైస్ సర్పంచ్ గబ్బాడి గణపతి, సచివాలయ కన్వీనర్లు సూర్యప్రకాష్ నాయుడు, రోజా, రమణ, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూరుబాబు, మాజీ సర్పంచ్ పండుదొర, నాయకులు సత్యనారాయణ, ఈశ్వర పడాల్, కర్రిపడాల్, బంగార్రాజు,అరుణ్, కృష్ణారావు, లక్ష్మణ్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

అరకులోయ రూరల్: ప్రజాలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు, మండలంలో బొండం పంచాయితీ పరిధిలోని రంపుడువలస, రంగినిగూడ, కరకవలస, బలియగూడ గ్రామల్లో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో 219 గడపలను ఆయన సందర్శించారు. ఎమ్మెల్యే పాల్గుణ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకతీతంగా, పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. రాష్ట్రంలో నిర్వీర్యమైన వ్యవస్థలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గాడిలో తీసుకొచ్చారన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయం, గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. నాడు–నేడు ద్వారా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. మారుమూల గ్రామాల్లో రహదారులు, సెల్ టవర్ల నిర్మాణం వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మన్యంలో సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎంపీపీ ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ భాస్కర్‌రావు, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, నాయకులు శెట్టి వెంకటరావు, ముఖి, సాంబ, నర్సింగ్, అప్పలస్వామి, లైబన్,గణేష్,నాగేష్,బ భీమరాజు, హౌసింగ్ ఏఈ కృష్ణారావు, వీఆర్పీ ముత్యాలమ్మ, వీఆర్వో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి నాణ్యత పరీక్షలపై శిక్షణ



ఆదివాసీ యువతకు శిక్షణ ఇస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అడ్డతీగల: నీటి నాణ్యతపై జాగ్రత్త తీసుకోవాలని లయ స్వచ్ఛంద సంస్థ ఏరియా కో–ఆర్డినేటర్ జి.బుల్లయ్య చెప్పారు. న్యూఢిల్లీకి చెందిన ఎస్.ఎం.సెహగల్ సంస్థ సహకారంతో లయ సంస్థ ఆదివాసీ యువతకు ఈనెల 21 నుంచి గురువారం వరకు శిక్షన కార్యక్రమం నిర్వహించారు. కో–ఆర్డినేటర్ బుల్లయ్య మాట్లాడుతూ అల్లూరి, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 25 మంది ఆదివాసీ యువతకు తాగునీటి నాణ్యత పరిశీలనలో పాటించాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ప్రధానంగా తాగునీరు ఏ విధంగా కలుషితం అవుతున్నదీ (భౌతిక కలుషితం, రసాయనక కలుషితం, సూక్ష్మజీవుల ద్వారా కలుషితం) తదితర వాటిపై వివరించారు. అదే విధంగా తాగేనీటిలో ఫ్లోరిన్, క్లోరిన్, ఐరన్, నైట్రేట్, పిహెచ్, రెసిడ్యుల్ క్లోరైడ్, మైక్రోబయోలాజికల్ వంటి పది రకాలైన పరీక్షలపై శిక్షణలో తెలియజేశామన్నారు. శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు, ఫీల్డ్ టెస్ట్ కిట్లు అందజేస్తున్నామన్నారు. శిక్షణ పొందిన వారు తమ స్వగ్రామాల్లో తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆయన తెలిపారు.

ఆత్మీయ వీడ్కోలు



టీచర్ సింహాచలంను సన్మానిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

హుకుంపేట: మండలంలోని తీగలవలస పాఠశాల ఉపాధ్యాయురాలు బాకురు సింహాచలం బిరిసింగి పాఠశాలకు బదిలీకావడంతో గురువారం స్థానిక ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. తీగలవలస గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో థింసా నృత్యాలు నడుమ ఆమెను ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా అల్లంపుట్టు పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం వేణుగోపాలరావు, సర్పంచ్ పాంగి బేసు మాట్లాడుతూ పాఠశాలకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. సీఆర్పీ మర్రి రత్నం, స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పి.రామయ్య, హెచ్‌ఎం ఎస్.రాజరత్నం,ఉపాధ్యాయులు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



కొత్తపాలెంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య



హుకుంపేటలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, అధికారులు



పెదలోచలిలో రైతులకు రాజ్‌మా విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ చిన్నకుమారి



టోకూరులోని రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ మోస్య తదితరులు

చింతపల్లిరూరల్: మండలంలోని కొత్తపాలెం, అన్నవరం, కొమ్మంగి ప్రాంతాల్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో గురువారం రైతులకు రాజ్‌మా విత్తనాలను జెడ్పీటీసీ సభ్యుడు పోతరాజు బాలయ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. అన్నవరం ఎస్ఐ రమణ మాట్లాడుతూ ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, దాన్ని విడనాడాలన్నారు. గిరిజనులు వాణిజ్య, ఉద్యానవన పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీనివాస్, కారదర్శి రాజేష్ , కొత్తపాలెం, అన్నవరం, కొమ్మంగి సర్పంచ్‌లు వనగల సోమరత్నం, సన్యాసిరావు,లక్ష్మి , అగ్రికల్చర్ అసిస్టెంట్ నాగ శంకర్, నాయకుడు బెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.
హుకుంపేట: మండలంలోని దాలిగుమ్మడిలో ఏవో లీలావతి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు వ్యవసాయ రంగంలో ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాయితీపై విత్తనాలు అందజేస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
జి.మాడుగుల: మండలంలోని పెదలోచలి ఆర్‌బీకేలో గురువారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బొడిగి చిన్నకుమారి రైతులకు రాజ్‌మా విత్తనాలను అందజేశారు. నాయకుడు మత్స్యంనాయుడు, రైతులు పాల్గొన్నారు.
అనంతగిరి: టోకూరు పంచాయతీ కేంద్రంలో సుమారు 200 గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను సర్పంచ్ కిల్లో మోస్య పంపిణీ చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉషా, మాజీ సర్పంచ్ దోన్ను, సచివాలయం కన్వీనర్ నరాజీ దోన్ను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగు పద్యాల పోటీలు

రావికమతం : కిత్తంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు గురువారం తెలుగు పద్యాల పోటీలను నిర్వహించారు. తెలుగు భాషా వారోత్సవాల సందర్భంగా తెలుగు భాషాభిమాని, ఆ క్లస్టర్ సీఆర్ఎంటీ రామారావు ఈ పోటీలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు పాల్గొని పద్యాలు పాడడమే కాక భావాన్ని వివరించారు. నలుగురు విజేతలను ఎంపిక చేసి బహుమతులను కూడా అందించారు. ఉపాధ్యాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

మండల సమావేశం రేపు

కొయ్యూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం తెలిపారు. ఉదయం 10 గంటలకు అన్ని శాఖల అధికారులు విధిగా వారి వద్ద ఉన్న వివరాలతో హాజరుకావాలని కోరారు. గతంలో జరిగిన సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను తీసుకురావాలని సూచించారు. గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

సచివాలయ కన్వీనర్లకు బీమా సౌకర్యం

కొయ్యూరు: సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, జేసీఏ మండల కన్వీనర్ సుధాకర్ తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 23 సచివాలయాల పరిధిలో ఉన్న అందరికీ కూడా ప్రత్యేక యాప్ ద్వారా బీమా చేస్తున్నామన్నారు. కొండగోకిరి సచివాలయం పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులకు బీమా నమోదు ప్రక్రియను చేపట్టామన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మసిలినాయుడు, సర్పంచ్‌లు శ్రీను, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో యూరియా

దేవరాపల్లి : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కేంద్రాల ద్వారా యూరియాను సరఫరా చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి వై. కాంతమ్మ అన్నారు. ఈ మేరకు మండల వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల అసవరం మేరకు పుష్కలంగా యూరియాను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 23 నుండి నేటి వరకు దఫ దఫాలుగా 487 మెట్రిక్ టన్నులు యూరియా సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం బోయిలకింతాడ, వాకపల్లి, రైవాడ, మామిడిపల్లి, ఎ.కొత్తపల్లి రైతు భరోసా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట ఆర్‌బీకేలకు రెండు, మూడు రోజుల్లో యూరియా అందుబాటులోకి వస్తుందని ఏవో వై. కాంతమ్మ తెలిపారు.

నేడు బాబా మందిర దశమ వార్షికోత్సవం

కశింకోట : మండలంలోని పల్లపు సోమవరంలో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయ దశమ వార్షికోత్సవం శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గొంతిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, హోమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం జరుపుతామన్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన, సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, సాయిబాబా భజన బృందంతో భజన, రేలా రే రేలా వంటి సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

స్టార్టప్‌ల ఏర్పాటుకు నైపుణ్యం తప్పనిసరి

తుమ్మపాల : సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఇన్నోవేషన్ ఆవశ్యకత గురించి వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో డైట్ స్టూడెంట్ చాప్టర్, ఇన్నోవేషన్ స్టార్టప్‌లపై గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు భవిష్యత్‌లో స్టార్టప్‌లు ఏర్పాటు చేసే విధంగా నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. విభాగాధిపతి ఎ.దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని, తద్వారా మాత్రమే కొత్త ఆవిష్కరణలకు నాంది పలకగలరన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి పండగ



ఊరేగింపులో భక్తులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామ దేవత మరిడమ్మ తల్లి పండుగను ఆదివాసీలు గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అమ్మవారి ఘటాన్ని (గరగ) ఉదయం నుంచి ఉపవాసంతో ఉన్న ఓ బాలిక తలపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. బాణాసంచా కాలుస్తు, మేళతాళాలతో జరిగిన ఊరేగింపుతో గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఘటాన్ని తాటాకులతో తయారు చేసిన అమ్మవారి మందిరంలో ఉంచి గిరిజన సాంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. కొబ్బరికాయలు, పండ్లు, పసుపు కుంకుమ, పూలు, నూతన వస్త్రాలు, రకరకాల పిండివంటలను భక్తులు అమ్మవారికి సమర్పించి దీప దూపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకొన్నారు.వర్షాలు సంమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, పిల్లలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడాలని తల్లిని భక్తులు వేడుకున్నారు. అనంతరం ప్రసాదవితరణ జరిగింది. మరిడమ్మ అమ్మవారికి ఏటా ఇలా సంబరాలు జరుపుకోవడం అనాదిగా గిరిజన సంప్రదాయంగా పూజారులు తెలిపారు.

ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: ప్రభుత్వం అందిస్తున్న సేవలను పారదర్శకంగా ప్రజలకు చేరవేయాలని గ్రామ సచివాలయ కన్వీనర్లకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన సచివాలయాల కన్వీనర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో గ్రామ వలంటీర్లకు సచివాలయ కన్వీనర్లు అనుసంధానంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా జేసీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా గ్రామ సచివాలయాల కన్వీనర్లచే ఆరోగ్య బీమా నమోదు చేయించారు. కన్వీనర్లకు జగనన్న ప్రభుత్వం ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడు మండలాల కన్వీనర్లు, నేతలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు, జెడ్పీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణ పనుల పరిశీలన



గడుతూరులో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖరరావు

జి.మాడుగుల: మండలంలోని గడుతూరు పంచాయతీ కేంద్రంలో సచివాలయం భవ నిర్మాణ పనులను ఎంపీడీవో చంద్రశేఖరరావు గురువారం పరిశీలించారు. నాణ్యత పాటించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న మట్టి కందకాల పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి పనులు కొలతలు సక్రమంగా పాటించాలని సూచించారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులకు విద్యాబోధన, విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. జగనన్న విద్యా దీవెన కిట్లు పంపిణీపై ఆయన ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఛత్రపతి, సచివాలయ, ఉపాధి హామీ పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

గూడెంకొత్తవీధి: మన్యంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కోసం నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అన్నారు. మండలంలోని శిరుబాల, దామనపల్లి, గూడెం కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. గ్రామస్తులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అందరికీ సంక్షేమ పథకాలు చేరవయ్యేలా చూడాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల విమర్శలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని సూచించారు. మాజీ ఎంపీపీ వి.బాబూరావు, మాజీ వైస్ ఎంపీపీ బి.కృష్ణారావు, పెదబరడ సర్పంచ్ సమిడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అందుబాటులోకి పెట్రోల్ బంకు



జి.మాడుగులలో జీసీసీ పెట్రోల్ బంక్‌ను పరిశీలిస్తున్న పాడేరు జీసీసీ డీఎం సింహాచలం

జి.మాడుగుల: మండల కేంద్రంలో గల జీసీసీ పెట్రోల్ బంక్ నుంచి పెట్రోల్, డీజిల్ విక్రయాలకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్టు పాడేరు జీసీసీ డీఎం డి.సింహాచలం తెలిపారు. జి.మాడుగుల–చింతపల్లి రోడ్డు మార్గంలో గాంధీనగరం గ్రామ సమీపమున గల జీసీసీ పెట్రోల్ బంక్‌ను గురువారం ఆయన పరిశీలించారు. గత వారం రోజుల నుంచి పెట్రోల్ పంపు మరమ్మతులకు గురికావడంతో బంకు సేవలు నిలిచిపోయాయి. దీంతో జీసీసీ డీఎం సింహాచలం తనిఖీ చేశారు. ఈ ప్రాంతంలో రాకాపోకలు సాగించే వాహనదార్లు, పెట్రోల్, డీజిల్ వినియోగదారులు ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని శుక్రవారం నుంచి పెట్రోల్ బంక్‌లో డీజిల్, పెట్రోల్‌ను విక్రయాలకు పత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నొయిన, ఎంపీటీసీ కమల, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని పనసపుట్టు పంచాయ కేంద్రంతో పాటు టిక్రపడ గ్రామాల్లో జిల్లా పరిషత్ నిధులు రూ.5లక్షలతో 100 మీటర్ల సీసీరోడ్డు పనులకు సర్పంచ్ జె.నోయిన, ఎంపీటీసీ సభ్యురాలు బి.కమల గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీఎం జగనన్న పాలనలో మన్యంలో గిరిజన గ్రామాలకు మహర్దశ నెలకొందని ప్రతి గ్రామానికి రహదారి, సీసీ రోడ్డు సౌకర్యం కల్పించి రవాణా వ్యవస్థను మెరుగుపడుతోందన్నారు. ఏళ్ల తరబడి అధ్వాన రహదారితో అవస్థలు పడ్డ గిరిజనులకు జెడ్పీ నిధులతో నూతన రహదారులు, సీసీ రోడ్లు మంజూరు చేస్తూ వారి కష్టాలను తీరుస్తున్నామన్నారు. ప్రజలంతా ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలన సీఎం జగనన్న తీసుకువచ్చారని, ప్రజలు అన్ని విదాలా అభివృద్ధి చెందాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందన్నారు. నేతలు జగబందు, తిరుపతిరావు, భగత్‌రామ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.